

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై 1794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాధలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. ఆ794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

(గతసంచికతరువాయి)

**యుద్ధవీరులు తయారుకావాలి**

"దేశంలో చిన్న రాజ్యాలు ఎక్కువగా ఉండటం వల్ల ఎవరికి వారు రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలి. అంతర్గత రక్షణతోపాటు బ్రిటిష్ వారి దాడుల నుంచి రక్షణ పొందడానికి ప్రయత్నాలు చేయాలి. అందుకోసం ప్రతిరాజ్యంలో యుద్ధవీరుల్ని ప్రత్యేకంగా తయారుచేసుకోవాలి. యుద్ధతంత్రాలు తెలిసినవారు, వీరమరణం పొందడానికి కూడా వెనుకాడని వీరులు ఎక్కువమంది ప్రతిరాజ్యంలోనూ ఉండాలి. అటువంటప్పుడు ఆ రాజ్యం శత్రువులనుంచి ఎటువంటి భయం లేకుండా సురక్షితంగా ఉండగలుగుతుంది" ప్రధాన దివాన్ బుర్రా బుచ్చెన్న చెప్పేవాడు.

ఈ విషయాలను వింటుంటే విజయరామరాజుకు నిజమే అనిపించింది. ఏ రాజ్యానికైనా ఇటువంటి పరిస్థితి ఉండాలి. ఇందుకోసం ప్రయత్నాలు కూడా చేయాలి. పెద్ద స్రామాజ్యంగా, ఆస్థులు.. అంతస్తులు ఎక్కువగా ఉన్న సుభిక్షమైన దివాణంగా పేరు పొందిన విజయనగరం విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం కూడా ఉందని భావించాడు.

విజయనగరం కోటలో ప్రత్యేక సమావేశం జరుగుతోంది.

ఆ సమావేశం విజయనగరానికి రక్షణ కల్పించవలసిన పరిస్థితుల్ని చర్చించడానికి, సలహా సూచనలు పొందడానికి వివిధ ప్రాంతాలనుంచి ప్రత్యేకంగా పిలవబడిన వారితో జరుగుతున్న కీలకమైన సమావేశమది. ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వారు చాలా ముఖ్యులు యుద్ధ తంత్రాలలో నైపుణ్యం కలిగినవారు. విజయనగరం సంస్థానానికి ఆప్తులు వారికి తోడుగా విజయనగరం సంస్థానంలో సైన్యాన్ని నడిపించే దండ నాయకులు కీలకమైన మరెంతో మంది ఆ సమావేశానికి హాజరయ్యారు. వారిలో సామంతరాజులు కూడా ఉన్నారు.

ఒకొక్కరు చెబుతున్న విషయాలను, సలహాలను విజయరామరాజుకు సన్నిహితంగా మెలిగే వ్యక్తులు రాసుకుంటున్నారు. విజయనగరంలో ఉన్న సైనికులకు వివిధ విషయాలలో తర్ఫీదు ఇవ్వడానికి వచ్చిన వారు కూడా తమకు తోచిన సలహాలను ఇస్తున్నారు.

"మీరు చెప్పిన విషయాలు నాకు కొంతవరకు అర్ధం అవుతున్నాయి. ఈ దేశంలోనే అతి పెద్ద సంస్థానంగా పేరు పొందిన విజయనగరం గురించి అందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాంత ప్రజల రక్షణ కోసం వారు మన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం కోసం మనం ఎంతో కృషి చేయవలసిన అవసరం ఉంది. నేను ఏమి చేయాలో సెలవియ్యండి.. మీ అభిప్రాయాలకు ఎంతో విలువ ఉంటుంది. సందేహం లేకుండా ఎవరు ఏమి అనుకుంటారోనన్న బెరుకు లేకుండా చెప్పండి" విజయరామరాజు వచ్చిన వారిని అడిగాడు.

"ఇంగ్లండు దేశం నుంచి వచ్చిన తెల్లదొరలు ఈస్టుఇండియా పేరుతో కంపెనీని నెలకొల్పి ఇప్పటికే అనేక సంస్థానాలపై కన్ను వేశారు. చిన్న దివాణాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నింటిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మనం సాగు చేసుకుంటున్న భూములకు వారికి కప్పాలు కట్టాలని ఆంక్షలు విధిస్తున్నారు. చిన్న సంస్థానాలను తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవాలనుకుంటున్నారు. వారి అధికార కాంక్షను మనం సమర్ధంగా ఎదుర్కోవాలి"

"ఎలా?"

"రాజుల్ని చిన్నచూపు చూసే తెల్లదొరలు ఎక్కువమంది అయ్యారు. ఇక్కడి రాజుల్ని అంచనా వేస్తున్నారు. పేరులోనే పౌరుషాలు తప్పా వాస్తవంలో కాదని కొంతమంది ఇక్కడివారే వారికి చెబుతుండటం వల్ల తలెత్తిన పరిస్థితి ఇది. ఈ దేశంలో ముఖ్యంగా తెలుగునేలలో రాజ్యపాలకులంతా విలాసాలతో మునిగితేలేవారని వారి కింద ఉన్న సైన్యం కూడా ఎటువంటి శిక్షణ లేకుండా కేవలం

పనివారిగా ఉంటున్నారని అనుకుంటున్నారు. మన సంస్థానాలలో కొంతమంది అలా ఉండవచ్చు. కొన్ని దివాణాలను చూస్తే ఆ విషయం నిజమే అనిపిస్తుంది. కానీ విజయనగరం సంస్థానం ఆ విధంగా లేదని మనం నిరూపించాలి.."

"ఈ పరిస్థితిలో ఏమి చేస్తే బాగుంటుంది. మనని మనం మెరుగుపరుచుకోవడానికి ఏం చేయాలి. మన వనరులేమిటి మన అవసరాలేమిటో తమరు గుర్తించారా గోపాలం బాబుగారూ?" నెమ్మదిగా విజయరామరాజు ప్రశ్నించాడు.

మహారాజు తనని సలహా అడగడంలో అంతవరకు రసవత్తరంగా జరుగుతున్న సంభాషణ ఒక్కసారి గోపాలరాజు వైపు తిరిగింది. ఇటువంటి విషయాలపై కొంతవరకు అవగాహన ఉన్నా తన సలహాపై ప్రభువుల వారు నమ్మకం ఉంచినందుకు కించిత్ గర్వంగా అనిపించింది. వెంటనే గొంతుని సవరించుకుని "చాలామంది రకరకాల సలహాలు ఇస్తున్నారు. తుని నుంచి వచ్చిన దివాన్ వత్సవాయి వీర్రాజుగారు చెప్పిన విషయాలు బాగున్నాయి. సమంజసం అనిపిస్తున్నాయి. సైన్యానికి మెలుకవలు నేర్పించడానికి వచ్చిన సులేమాన్ సాబ్ కూడా మరఫిరంగుల గురించి చెప్పారు. వాటి వినియోగం, కొనుగోలు చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ఇంకా పెద్దలు రకరకాలు సూచనలు చేస్తున్నారు. వారంతా విజయనగరం సంస్థానం బాగుండాలని సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నవారే. అటువంటి వారి ఆలోచనలకు ఎంతో సంతోషం కలుగుతోంది. సువిశాలమైన విజయనగరం కోట, ఈ దివాణం అన్నీ మన ఆధీనంలోనే ఉండాలి. మన రాజుల పౌరుషం నిలబెట్టాలి. మనం మరొకరికి ముఖ్యంగా ఆంగ్ల ముష్కరులకు బానిసలుగా మారకూడదన్న సంకల్పం అందరిలోనూ కలిగించాలి. ఈ సమావేశానికి విచ్చేసిన రాజులకు సామంతరాజులకు ఇతర ఆత్మీయులకు ప్రతివారికీ విజయనగరం మహారాజా వారి తరపున కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను."

"అభినందనలు కాదు. విషయం ముందు చెప్పండి" విజయరామరాజు గోపాలరాజుకు చురక అంటించారు.

విజయరామరాజుకు ఉన్న చిరుకోపం గురించి గోపాలరాజుకి బాగా తెలుసు అందువల్ల అంతకన్నా తను ఎక్కువ మాట్లాడకూడదని అనుకుని "ఏమి చేయాలన్న విషయం పెద్దలందరికి తెలుసు. వ్యూహాన్ని చెప్పండి. దానిని తూచా తప్పకుండా ఆచరించడానికి అందరూ సిద్ధంగా ఉంటాం" అని చెప్పి పక్కకు వెళ్ళిపోయాడు.

"మనని మనం రక్షించుకోవాలి. మన స్వతంత్రతను మనం కాపాడుకోవాలి. ఇందుకోసం ఆర్థిక అంగబలాలు మన సంస్థానానికి ఎంతో అవసరం. అంగబలం ఉన్నా అది సమర్ధవంతంగా పనిచేయాలి. ఉన్నవారు కేవలం తమ ఉపాధికోసం పని చేస్తున్నారని కాకుండా విజయనగరం సంస్థానం కోసం తాము పనిచేస్తున్నామని అనుకునే విధంగా ఉండాలి. వారిలో వీరత్వం పొంది ప్రవహించాలి. అటువంటప్పుడు ఎంత బలవంతుడైన శత్రువు దాడి చేసినా ఎదుర్కోగలుగుతాం. శత్రువు కూడా భయపడతాడు."

"మన తక్షణ కర్తవ్యం ఏమిటి?"

"వీరుల్ని తయారుచేయాలి"

"ఉన్నవారంతా విజయనగరం వీరులే కదా"

"మన సైనికులను మనం వీరులుగానే భావిస్తాం. మన సైనికులు అన్ని నైపుణ్యాలను తెలుసుకుని యుద్ధవీరులుగా తయారు కావల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా కృషిచేయాలి. అందుకు అనుగుణంగా దేశభక్తి మహారాజు పట్ల ప్రభుభక్తి కలిగిన వారిని సైనికులుగా నియమించుకోవాలి. విజయనగరం దివాణంలో సైనికులందర్ని యుద్ధవీరులుగా తీర్చిదిద్దవలసిన అవసరం ఉంది."

"అవును.. యుద్ధవీరుల్ని తయారు చేయాలి"

వారికి యుద్ధతంత్రాలను నేర్పించాలి. ఓటమి ఎరుగని ధీరులుగా వారిలో ధైర్యాన్ని నూరిపోయాలి. విజయనగరం సంస్థానంలో పటిష్టమైన సైనిక బలగం ఉందన్న నమ్మకాన్ని అందరికి కలిగించాలి. అందరిలోనూ ధృఢమైన ఆలోచనలు..

విజయనగర సంస్థానాన్ని ఈస్టుఇండియా కంపెనీ సైన్యాన్ని ఎదుర్కొనే పటిష్టమైన సైనిక సామర్ధ్యం కలిగిన రాజ్యంగా తయారు చేయాలని అక్కడున్నవారందరిలో ధృఢమైన సంకల్పం ఏర్పడింది.

**విజయరామరాజు అంతరంగ మధనం**



కోట లోపల అంతరంగిక మందిరం. ఈ మందిరంలోనే చిన విజయరామరాజు ఎక్కువగా ఉండేవారు. ఇక్కడి నుంచే పరిపాలన చేసేవారు. ఈ మందిరం విజయనగరం కోట లోపల భాగంలో ఉంది. ఇక్కడికి వెళ్లాలంటే నాలుగైదు భవనాలను దాటుకుని వెళ్లవలసి ఉంటుంది.

విజయనగరం కోట

కోటలో దూరంగా ఒక పక్క అంతరంగ మందిరం. ఒంటిస్థంభం మేడ మాదిరిగా ఉంటుంది. ఆ వైపు ఎవరూ వెళ్ళరు. రాజుగారు ఆ మందిరానికి అప్పుడప్పుడూ వస్తుంటారు. మనసు బాగోలేనప్పుడు, ఆలోచనలు మనసుని కలవరపెడుతున్నప్పుడు, తీవ్రమైన సమస్య ఎదురై గుండె గొంతులో బాధ కలవరపెడుతున్నప్పుడు ఆ మందిరం అవసరం పడుతుంది.

ఏడాదికి నాలుగైదుసార్లు మాత్రం అందులో విశ్రాంతికి విజయరామరాజు వస్తుంటారు. అయినా దాని నిర్వహణ నిత్యం ఉంటుంది. అందులో సిబ్బంది నిరంతర పని చేస్తుంటారు. ఎప్పుడూ శుభ్రంగా ఉంచుతారు. విజయరామరాజుగారు ఏ సమయంలో అక్కడికి వస్తారో, ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయో తెలియనందువల్ల నిత్యం అప్రమత్తంగానే ఉంటారు.

ఉదయాన్నే రాజుగారి వ్యక్తిగత సహాయకుని నుంచి కబురు వచ్చింది. మందిరానికి వస్తున్నారని దాని సారాంశం. ఆ కబురు అందిన వెంటనే మందిరంలో పనిచేసే సిబ్బంది అవసరమైన పనులు చేయడానికి సమాయత్తం అయిపోయారు. రాజుగారికి ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియనందువల్ల అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మందిరంలో అత్యవసరంగా కావల్సిన సదుపాయాలను సమకూర్చారు.

విజయరామరాజు ఆ మందిరానికి విచ్చేశారు.

ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియనందువల్ల ముఖ్యమైన సిబ్బందిని అందుబాటులో ఉండటానికి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. వివిధ పనులకు నియమించబడిన సహాయక సిబ్బంది కూడా అందుబాటులోకి వచ్చారు.

మందిరంలోకి వచ్చిన చిన విజయరామరాజు అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెత్తని ముఖమల్ పరుపులు పరిచిన తల్పంపై ఆశీనులయ్యారు. ఎదురుగా గోడలపై తైలవర్ణ చిత్రపటాలు ఉన్నాయి. వాటిని చూస్తుంటే ఆలోచనలు రాజ్యపరిపాలన చుట్టూ తిరిగాయి. రాజ్యంలో అంతవరకు సజావుగా ఉన్న పరిస్థితులు ఒక్కసారి తిరగబడుతున్నట్టు అనిపిస్తోంది. దివాణంలో ఉన్న వారందరూ రకరకాల సలహాలు ఇస్తున్నారు. రాజ్యాన్ని పటిష్టంగా ఉంచాలని యుద్ధవీరుల్ని తయారు చేయాలని సూచనలను చేస్తున్నారు. వీటన్నింటిని వింటుంటే విజయనగరం సంస్థానం పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతుందా అన్న అనుమానాలు అతనిలో కలుగుతున్నాయి.

అసలు ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడింది?

రానున్న కాలం సజావుగా ఉంటుందా లేదా? ఆందోళనలు అలజడులతో కకావికలం అవుతుందా తెలియడంలేదు. రాజ్యంలో అంతర్గత సంఘర్షణలు జరుగుతున్నాయేమో తెలియడంలేదు. బ్రిటిష్ వారి పరిపాలన దేశంలో వేళ్ళూనుకుంటోంది. చాలామంది వారి

విధానాలను ఆకర్షితులవుతున్నారు. ఒకవేళ ఎవరైనా ఎదురు తిరిగినట్లయితే వారిని తమ తోవలోకి తెచ్చుకోవడానికి సామ, బేధ, దాన, దండోపాయాలను ప్రయోగించడాయనికి సిద్ధపడుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో ఏమి చేయాలి ఎలాంటి చర్యలు తీసుకోవాలి. తన భుజస్కంధాలపై పెట్టుకుని విజయనగర సంస్థానాన్ని నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉందని విజయరామరాజుకు అనిపించింది. యుద్ధవీరుల్ని తయారు చేయాలని కొంతమంది ఇచ్చిన సలహాలు బాగున్నాయి. వాటిని అమలు చేయడానికి ప్రయత్నాలు చేయాలి. ఇందుకోసం కొంతమంది వీరుల్ని ఎంపిక చేయాలి. ఉన్నవారిలో నమ్మకస్తులను గుర్తించాలి. వారికి ధైర్యంతోపాటు శత్రువులను ఎదుర్కొనే పోరాటాలను నేర్పించాలి. యుద్ధవ్యూహాలను తెలియజేయాలి. ఇవన్నీ చేయడానికి ఆర్థిక బలం ఉండాలి. ఖజానాలో ఉన్న నగదు, సంస్థానం నిర్వహణ విషయాలకు ఇతర ఖర్చులకు సరిపోతోంది. అందువల్ల రక్షణ కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చూడవలసిన అవసరం ఉందని అనిపించింది.

ఆలోచనలు తలని వేడెక్కిస్తున్నాయి.

విజయరామరాజు అంతవరకు ఈ కోణంలో ఆలోచన చేయలేదు. విజయనగరం వంటి అతి పెద్ద సంస్థానానికి దత్తుడిగా రావడం వల్ల బోగభాగ్యాలు సొంతమవుతాయని అందరూ అనుకున్నారు. తనకు కూడా అనిపించింది. తన బంధువర్గం కూడా ఆ రకంగానే ఆలోచనలు చేసింది. అయితే పరిస్థితి ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ఉంది. తాను ఇక్కడికి వచ్చినప్పటికి ఇప్పటికీ ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. పన్నెండేళ్ళ వయసులో తాను ఈ దివాణానికి వచ్చినప్పుడు చాలా విషయాలు తెలిసేవి కాదు. అమ్మయ్య చంద్రయ్యమ్మ చాలా వ్యవహారాలు చూసుకునేవారు. ఆ తర్వాత నుంచి క్రమక్రమంగా పరిస్థితులు మారుతున్నాయి. తన వయస్సుతోపాటు దివాణంలో నిర్వహణ విషయాలు కూడా పెరిగిపోయాయి. కొత్తకొత్త విధానాలు వచ్చాయి. రాజ్యపాలకునిగా ఉంటూ పెద్దవాడవుతున్న తనతోపాటు సమస్యలు కూడా పెద్దవిగా తయారయ్యాయి.

ఇంతకుముందు తనని అందరూ నడిపించేవారు. ఇప్పుడు తానే అందర్ని నడిపించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తనకు ఎందరో సలహాలు ఇస్తున్నా తన సలహా సూచనలు ఉంటేనే పనులు జరుగుతున్నాయి. తన చూపుకోసం, ఆజ్ఞ కోసం ఎదురుచూసేవారే అందరూ కనిపిస్తున్నారు. ఏ నిర్ణయం దానికి తనదే పూర్తిబాధ్యతగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో అర్థంకాని అయోమయం చుట్టుముడుతోంది.

ఆలోచిస్తున్న విజయరామరాజుకు ఎదురుగా ఉన్నదంతా శూన్యంగా కనిపిస్తున్నట్లుగా ఉంది ఆలోచనలు మనసు చుట్టూ కారుమబ్బుల్లా ముసురుకుంటున్నాయి. ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకావడంలేదు.

ఆ మందిరంలో రాజుగారికి ఏర్పాట్లు చూడవలసిన పరిచారకుడు మెల్లగా అక్కడికి వచ్చాడు అతని చేతిలో టీ కెటిల్ ఉంది. కాశ్మీరు నుంచి ప్రత్యేకంగా రప్పించిన తేయాకుతో తయారు చేసిన టీ ని అక్కడ టేబుల్‌పై పెట్టి నిలుచున్నాడు.

సాధారణంగా పరిచారికలు కప్పులో టీ డికాషనులో అవసరమైనంత చక్కెర కలిపి అందిస్తుంటారు. అతను ఆ పని చేయడానికి అక్కడ నిల్చున్నాడన్న విషయం తెలిసి "వెళ్ళు" అన్నట్లు రాజుగారు చూపుతోనే ఆదేశించారు.

ఆ పరిచారకుడు అక్కడినుంచి తప్పుకున్నాడు.

తర్వాత విజయరామరాజు వేడివేడి టీని కప్పులో వేసుకుని అందుకున్నాడు. పొగలు కక్కుతున్న తేనీరు నోట్లోకి వెచ్చగా దిగుతుంటే మనసు కాస్త స్థిమితపడినట్లు అనిపించింది.

టీ తాగడం పూర్తి అయినట్లు గమనించిన ఆ పరిచారకుడు తాను తీసుకుని వచ్చిన సామాగ్రినంతా టేబుల్‌పైనుంచి తొలగించాడు. దానిని శుభ్రం చేసి నిశ్శబ్దంగా తీసుకుని బైటికి వెళ్ళిపోయాడు.

టీ తాగిన తర్వాత విజయరామరాజుకు తన ఆలోచనలకు కాస్త స్పష్టతవచ్చినట్లు అనిపించింది. మందిరంలో అటూ ఇటూ పచార్లు చేసి. "ఎవరక్కడ?" అంటూ పిలవగానే ఇద్దరు వ్యక్తులు వచ్చారు. "గోపాలంబాబుగారు ఎక్కడ ఉన్నారు? మందిరానికి రమ్మనండి."

ఆయన మాట పూర్తికాకముందే వారు అక్కడినుంచి హడావుడిగా కదిలి ముందుకు వెళ్ళిపోయారు.

***గాడిలోకి రానున్న పరిపాలన***

చిన విజయరామరాజు పిలుపునందుకుని వివిధ ప్రాంతాలలో ముఖ్యులైన రాజులంతా విజయనగరం వచ్చి సమావేశమయ్యారు. కోటలో ఉన్న సమావేశం మందిరంలో వాతావరణం గంభీరంగా ఉంది. విజయగోపాలరాజు, రామచంద్రరాజు, చినవీరభద్రరాజు, రాఘవరాజు, నీలాద్రిరాజు, పెదకృష్ణమాజు, నర్సరాజు తదితరులంతా చేరారు. విజయరామరాజు కుర్రవాడైనప్పటికి తమను సంప్రదించడానికి ముందుకు రావడం వారికి ఆనందంగా అనిపించింది.

సమావేశం ప్రారంభం అయింది.

సామంత రాజులతో పాటు దండనాయకులు ఇతర రక్షణ వ్యవహారాలు చూసే పెద్దలు చాలామంది వచ్చారు. సమావేశ మందిరంలో వారికి కూర్చోవడానికి ప్రత్యేకమైన ఆసనాలను ఏర్పాట్లు చేశారు.

పరిచయాలు అయి అల్పాహారాలు తీసుకున్న తర్వాత విజయరామరాజు వచ్చిన రాజులందర్నీ ఉద్దేశించి మాట్లాడుతూ.. "రెండు రోజులుగా విజయనగరం సంస్థానం భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాను. ఇటీవల కోటలో యుద్ధవిద్యల విన్యాసాల అనంతరం జరిగిన సమావేశంలో కొంతమంది కొన్ని సూచనలు చేశారు. ఈ రాజ్యాన్ని పరిరక్షించడానికి దీనిని పటిష్టం చేయడానికి వచ్చిన సలహాలను ఎంతో విలువైనవిగా భావిస్తున్నాను. అవి చాలా బాగున్నాయి. నాకు నచ్చాయి. వాటిని ఆచరించడానికి అనుసరించవలసిన మార్గాల కోసం ఆలోచిస్తున్నారు. ఏదో చేయాలని కాకుండా ఏదైనా చేయాలి. అనే విధంగా మనం ముందుకు వెళ్ళాలి." అన్నాడు.

చిన విజయరామరాజు విజయనగరం సంస్థానం గురించి ఆలోచిస్తున్న విధానం అక్కడికి వచ్చిన వారికి ఎంతో నచ్చింది. నీలాద్రిరాజు లేచి "బాబూ.. తమరు మా చిరంజీవి కన్నా చిన్నవారు. అయినా మీ ఆలోచనలు చాలా ఉన్నతంగా ఉన్నాయి. ఈ విజయనగరం సంస్థానం మీ బావాజీ (పెదవిజయరామరాజు) చనిపోవడంతో ఏమైపోతుందోనని ఈ చుట్టుపక్కల రాజులంతా చాలా ఆందోళన చెందారు. కానీ మీ ఆలోచనలు... మీ దృక్పదం చూస్తుంటే మళ్ళీ మాలో ఆశలు చిగురిస్తున్నాయి" ఉద్వేగంతో చెప్పాడు.

నీలాద్రిరాజు మాటలకు అక్కడికి వచ్చినవారు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ చప్పట్లు చరిచారు. కొతమంది "నిజం..నిజం.. నీలాద్రిబాబు చెప్పింది ముమ్మాటికీ నిజం" అన్నారు.

జామి, అలమండ ప్రాంతానికి చెందిన రాజులు కూడా "చినరాజా చాలా ధైర్యవంతులు. ఈ రాజ్యాన్ని బాగా ముందుకు తీసుకుని వెళ్ళగలరు" అన్నారు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments